అంతకుముందు తారురోడ్డు మీద దూరంగా కనిపించిన జీపు మలుపు తిరిగి ఎటుపోయిందో, యిప్పుడు కనిపించడంలేదు. మరి కొద్దిసేపాగితేగాని అది మళ్లీ కనిపించదు. సింహాచలం 'వాళ్లేనేమో...' అనుకుంటూ మాసినగడ్డాన్ని చేతులతో తడుముకుంటూ అలాగే నిలబడ్డాడు. లోపల పొకలో ఏదో చప్పుడవుతున్నది.

ఇంతలో బంగారయ్య తాటాకుగొడుగులో వచ్చి 'బీడీలియ్యవయ్యా...'అన్నాడు. సింహాచలం బీడీకట్ట తీసి యివ్వబోతే తీసుకోకుండా తల వూపి 'నువ్వు మన లోకంలో ఉండేట్టులేదే...ఏం కత? ఈ బీడీ లెప్పుడవ్నా తాగానా నేను?' అని అడిగాడు.

సింహాచలం వెంటనే 'నీ మార్కు బీడీల్లేవు...ఇయాళ్టికి ఈటితో సరిపుచ్చుకో... ఈ ముసురు తెరిపిస్తే ఎల్లి సరుకులన్నీ పట్టుకొస్తాను...అన్నీ విందుకుందయ్...' అన్నాడు.

బంగారయ్య నవ్వుతూ ఆ బీడీకట్ట అందుకుని ఒక బీడీ యివతలికితీసి వెలిగించుకుని 'ఇంక నువ్వేం ఎల్తావులే...బంగారమంటి కోమటి.. సంగీతంతో సెడ్డాడంట... ఇన్నాను...ఇన్నాను...అంతా ఇన్నానయ్యా... కలికాలం బుద్దులట్టా ముంచుకొస్తావుంటే విన్నని ఏం లాభం?' అన్నాడు. సింహాచలం బొమ్మలా నిలబడిపోయాడు. బంగారయ్య అంతలో కదిలి 'పద్దు రాసుకో...' అంటూ వెళ్లిపోయాడు

సింహాచలానికి వొళ్లు మండింది. కోపంతో క్రింది పెదవిని కొరుక్కుంటూ నిస్సహాయంగా నిలబడి దూరంగా రోడ్డుమీదికి చూశాడు. అంతలో జీపు మళ్లీ కనిపించింది. రెండుమూడు నిముషాలలోనే అది వేగంగావచ్చి అతని కొట్టు ముందు ఆగింది. దాని చుట్టూ వర్షపుజల్లు పడకుండా తెరలున్నాయి. లోపల ఎవరున్నారో కనిపించడంలేదు. అంతలో ఒకాయన బరువైన బూట్లతో దిగి, గొడుగు విప్పి, విసుక్కుంటూ, నీళ్లను చిందగొడుతూ నడిచి వచ్చి 'ఏమయ్యా! గోల్డ్ ఫ్లేక్ సిగిరెట్లున్నాయా?' అని అడిగాడు.

సింహాచలం తల అడ్డంగా వూపి వినయంగా 'లేవు బాబూ! చార్మినార్ తప్ప ఏవీ లేవు...పాడు ముసురు...ఎటెల్లేందుకూ ఈల్లేకుండా...'అని చెప్పాడు.

ఆయన జీపువైపు తిరిగి పెద్దగా 'ఫోర్ కాజిల్స్ తప్ప మరేవీ లేవుట...తెమ్మంటారా?' అని అరిచాడు.

ఎవరో చెయ్యి బైటికిపెట్టి 'తెమ్మ'ని సైగచేసి మళ్లీ వెంటనే చేతిని లోపలికి తీసుకున్నారు. ఆయన సింహాచలం వంక తిరిగి 'సరే... నాలుగు ప్యాకెట్లివ్వు...' అంటూ డబ్బు తీశాడు.

సింహాచలం సిగిరెట్ ప్యాకెట్లు ఆయనకు అందించి రూపాయికాయితం తీసుకుని మిగిలిన చిల్లర యిచ్చాడు. ఆయన వాటిని కోటుజేబులో వేసుకుని మళ్లీ విసుక్కుంటూ నీళ్లను చిందగొడుతూ జీపు దగ్గరికి వెళ్లాడు. ఆయన ఎక్కగానే జీపు కదిలి అంతలోనే కనుచూపుమేర దాటిపోయింది.

సింహాచలం చేతులు రుద్దుకుంటూ కొద్దిక్షణాలు నిలబడ్డాడు. తర్వాత బంగారయ్య మాటలు గుర్తొచ్చాయి. "ఏదో...ఇన్నాడంట...ఆడిబొంద... పొట్ట తాగుబోతు ఎదవ..." అనుకున్నాడు. మొన్న మొన్నటి వరకూ బంగారయ్యకు నిద్రలో నడిచే జబ్బుండేది. రాత్రిపూట అటూఇటూ తిరుగుతూ కనిపించేవాడు...ఒకనాడు అర్ధరాత్రివేళ నిద్రలోనే నడుస్తూవచ్చి ఒక ఎద్దు ముందుకు వెళ్లి నిలబడ్డాడు. అతని అదృష్టం మంచిదికావడాన, అతని పెళ్లాం మెడలో నల్లపూసలతాడు గట్టిది కావడాన సింహాచలం అప్పుడు మేలుకునివున్నాడు. గభాలున లేచి వెళ్లి యివతలికి ఈడ్చుకురాబట్టి బతికిపోయాడు...లేకపోతే ఆనాడు ఆ పోట్ల ఎద్దు అతన్ని కుమ్మికుమ్మి చంపేసివుండేది...

సింహాచలం చిన్నపుస్తకం తీసి అందులో బంగారయ్యపేర బీడీకట్ట పద్దురాసి, ఏమి తోచక ఎవరెవరు ఎంత బాకీవున్నారో లెక్కచూస్తూ కూర్చున్నాడు. గుర్నాథం... ఆయనొక కంట్రాక్టు గుమాస్తా...పది రూపాయల చిల్లరయివ్వాలి. రంగడు...వీడు ఎరువుల ఫ్యాక్టరీలో కూలీ...అయిదురూపాయల పదిపైసలు. అప్పలస్వామి...కొండమీది బంగళాలో వాచ్‌మన్...పదిహేను రూపాయలు. పోతరాజు.. వీడికి పనీపాటా లేదు...పెళ్లాం అడవిలో పుల్లలేరుకుని పట్టుబట్టి కైలుదగ్గర అప్పుచేసి పెడుతుంటే తిని బలాదూరు తిరుగుతూ వుంటాడు...ఎనిమిది రూపాయల యిరవైపైసలివ్వాలి...పైగా పెళ్లానికి చెప్పొద్దని కాళ్లు పట్టుకుంటాడు. సుబ్రమణ్యం... ఈనకు జీతం ఎంతో తెలీదు...గోల్డ్ ఫ్లేక్ తప్ప మరొకటి కాల్చడు... పద్దెనిమిది రూపాయలివ్వాలి...

సింహాచలం ఆ చిన్నపుస్తకంలో పేజీలు తిప్పుతున్నవాడల్లా ఒకచోట ఆగిపోయాడు. తర్వాత నిట్టూర్చాడు. ఆ పేజీలో పైన వంకరటింకర అక్షరాలతో 'సింగారవేలు' అని పేరు వ్రాసివుంది. క్రింద కాతా... తర్వాత ఒక గీత...పేజీ చివర మూడు రూపాయల పదిపైసలు లెక్క...

సింగారవేలు అతని కళ్లలో మెదిలినట్టయింది. సింగారవేలు సన్నగా పొడుగ్గా చువ్వలా వుండేవాడు...ఎల్లప్పుడూ లుంగీ పైకి కట్టుకుని నవ్వుతూ తిరుగుతూ వుండేవాడు...వచ్చీరాని తెలుగులో మాట్లాడుతూ అందర్నీ నవ్విస్తూ వుండేవాడు... అక్కడే బల్లమీద కూర్చుని మద్రాసును గురించీ, అక్కడి సినిమాలను గురించీ ఎడతెగకుండా కబుర్లు చెబుతూ వుండేవాడు...

సింహాచలం ఆలోచనలకు అడ్డుకట్టవేసి పక్కకు చూశాడు. అప్పలస్వామి చిరుగుల గొడుగులో వచ్చి చూరుక్రింద నిలబడి దాన్ని నెమ్మదిగా మూసి ఒక పక్కనవుంచి 'ఏమయ్యా! సివ్వాచలం — బేరం లేదనుకుంటానే బొత్తిగా...' అన్నాడు కూర్చుంటూ.

సింహాచలం తల అడ్డంగా వూపి నిట్టూర్చి 'ఇట్టా ముసురు పట్టింది గదా! ఏంచెయ్యమన్నావు ... ఒక్క సరుకు లేదు కొట్లో...'అన్నాడు.

'అవునవును...ఇది గాలివానంట...బంగళాలో పెద్దోళ్లనుకుంటావుంటే ఇన్నాను. ఇప్పట్లో తగ్గదంట...' అని చెయ్యి చాపి 'ఏదీ? బీడీకట్ట అందుకో...! అన్నాడు అప్పలస్వామి...

సింహాచలం లేచి బీడీకట్ట యిచ్చి పద్దు తీసి పదిహేన్రూపాయలైంది నీ పద్దు... బొత్తిగా డబ్బులేదు...ఎప్పుడిస్తావు?' అని అడిగాడు.

అప్పలస్వామి బీడీ ముట్టించి అగ్గిపుల్లను విలాసంగా ఆర్పి అవతల పారేస్తూ

'ఛా... అయ్యో! డబ్బు లేనిదే...' అన్నాడు తర్వాత ఒక్క క్షణం ఆగి లోపలికి చూసి అదోకరకంగా నవ్వుతూ 'అయినా నీకిప్పుడు డబ్బుకు కొదవేంటిలే...ఇలే పిట్టను పట్టావు.. నాకు తెలుసుగా దాని మెడ నిండా బంగారమే...అన్నట్టు కథ ఎందాకా వొచ్చిందేం? అయినా నా పిచ్చిగాని నువ్వు చెప్తావా? ఏదో ఛాదస్తం కొద్దీ అడిగా నంతే...' అని ఊరుకున్నాడు.

సింహాచలం కళ్ళు ఎర్రబడ్డాయి. కోపం పొంగివచ్చింది అయినా తమాయించుకుని ఏమీ మాట్లాడకుండా అలాగే నిలబడి పోయాడు. అప్పలస్వామి కాస్సేపు నిశ్శబ్దంగా కూర్చుని తీరిగ్గా బీడీ కాల్చుకుని లేచి నిలబడి తలగుడ్డ విదిలించి చుట్టు కుంటూ 'తిరపతిగాడు...అదే నీ మావ... కోపంతో చిందులు తొక్కుతున్నాడయ్యోయ్.. ఇచ్చి కూడా మొన్న కనబడ్డాది. ఒకటే ఏడుపంట రాత్రీపగలూ.. తండ్రీ కూతుళ్ళు నీ పేరు ఇంకోసారి మండిపడిపోతా వుండారు...అయినా నువ్వు నాకు నచ్చావు... ముందు మన లాభం చూసుకోవాలి.. లేక పోతే ఈ లోకంలో బతకలేం. మంచిపనే చేశావ్...కానియ్. కానియ్...' అంటూ గొడుగు తెరుచుకుని వెళ్ళిపోయాడు.

సింహాచలం నిస్సహాయంగా చూస్తూ కొయ్యబొమ్మలా నిలబడిపోయాడు. ఒక్క నిముషం ఆగి ఎవరో తరుముకు వచ్చినట్టు లోపలికి పరుగెత్తుకు వెళ్ళాడు. లోపల పిరియనాయకి దణ్ణెంమీద తడిచీరను ఆర బెడుతున్నది. అడుగుల చప్పుడు విని వెను

ముసురు

తిరిగి సింహాచలం వంక చూసింది. ఆమెని చెంపకు చేరడేసి కళ్ళు...ఆ కళ్ళలో స్పష్టంగా కనిపించేది అమాయకత్వం...చామన చాయ వొంటిరంగు...ప్రత్యేక శ్రద్ధతో తీరిగ్గా కూర్చుని ఎవరో శిల్పి మలిచి నట్టుండే చక్కని విగ్రహం....

మనసులో అనుమానం తీరగానే సింహాచలం మళ్ళీ వెనుదిరిగి కొట్టుమీదికి వచ్చాడు. అతనికి ఈ అయిదారురోజుల నుంచీ కంటిమీద కునుకులేదు. మనసులో ప్రశాంతత లేదు ఆమె పరాయిమనిషి మన భాష తెలీదు...కళ్ళు పెద్దవి చేసుకుని అమాయకంగా చూడ్డం తప్ప మరేమీ చేతకాదల్లేవుంది ఆమెకు. నిశ్శబ్దంగా ఏడుస్తూ ఒకమూల కూర్చున్నదీ అయి దారురోజులనుంచీ సింహాచలం ప్రతి నిముషమూ జాగ్రత్తగా వున్నాడు అతని మనసులో అనుమానం...ఆమె అన కన్ను గప్పి ఏ నిముషంలో ఏ అఘాయిత్యం చేస్తుందో అని దిగులు.. అందుకే కట్లో సరుకులన్నీ నింపుకున్నా అతడు ఎక్కడికీ వెళ్ళలేదు. నిజానికి ఆ గుక్కెడు ప్రాణాలూ పోవడానికి ఎంత కావాలి? ఒక మూరెడు గుడ్డపేలికగాని తాడుగాని చాలు దొడ్లో బావి ఉండనేఉంది. అదీ గాకపోతే కొంచెం కిరసనాయిలూ...ఒక ఆగ్గిపుల్లా.. అన్నీ ఆమెకు అందుబాటులోనే వున్నాయి అందు వల్లనే అతడు రాత్రిపూట కూడా కంటి మీద కునుకులేకుండా మేలుకుని గడిపాడు.

ఎప్పుడన్నా కొన్ని నిముషాలసేపు కునుకు పడితే మెలకువరాగానే ఉలికిపడిలేచి చివా లున లోపలికి వెళ్ళి చూసేవాడు. తీరా చూస్తే ఆమె లోపల నేలమీద కొంగు పరుచుకుని పడుకుని నిద్రపోతూ వుండేది... పగటిపూట ధైర్యంచేసి ఆమెను వొంటరిగా వొదిలి సరుకులకోసం వెళ్ళినా ఆమెను గురించి, ఆమె మెడలో నగలను గురించి దిగులు తప్పదు...

అతడు కాళ్ళు ముడుచుకుని బల్లమీద కూర్చుని తాను అన్ని వివరాలతో ఉత్తరం వ్రాయించి పంపి ఎన్నాళ్ళయిందో వ్రేళ్ళు మడిచి లెక్క వేసుకున్నాడు. ఎంత ఆలస్యంగా చేరినా వాళ్ళకు ఆ ఉత్తరం ఈపాటికి అందివుండాలి. వాళ్ళు ఈపాటికి బయలు దేరి రావాల్సిందే మరి.. అయినా ఆవొడు బంగళాలో ఉండే ఆ మునసిపంతులు వాళ్ళ అడ్రసు సరిగ్గా రాసేడో, లేదో...అసలు ఆమె చెప్పిన అడ్రసు సరి అయినదో, కాదో.

అంతలో తిరపతి వానచినుకులలో తడుస్తూ తపతడుతూ నడుస్తూ వచ్చాడక్కడికి సింహాచలం లేచినిలబడ్డాడు తిరుపతి నుదుటినీ, కనురెప్పలనూ తుడుచుకుంటూ కూర్చుని ముందు అదోకరకంగా నవ్వాడు సింహాచలం ఏం మాట్లాడాలో, ఏం చెయ్యాలో తెలీని వాడిలా నిలబడివుండిపోయాడు.

తిరపతి యాభైఏళ్ళవాడు. బాగా తాగి నట్టున్నాడు మనిషిలో నిలకడలేదు అతడంతలో సింహాచలం వంక క్రూరంగా చూస్తూ కొన్ని క్షణాలు ఏమీ మాట్లాడ లేదు. తర్వాత హఠాత్తుగా 'ఏరా! నా ముద్దుల అల్లుడూ...అది లోపలే వుందా యింకా?' అని అడిగాడు.

సింహాచలం తల వూపి ఊరుకున్నాడు.

'అవును.. ఉంటదిలే...ఉండక మరింకె యాడికి పోద్ది పాపం...మంచి మొగోడివి దొరికావు ..అదింక నిన్ను వొదిలి పెట్టుద్దా ...అసలు నేనంతా తెలివితక్కువ సన్నాసను లంరా. నువ్వొక్కడివే ఈడ తెలివిగల మొగోడివి. అంతే మరి.' అన్నాడు తిర పతి ఎగతాళిగా...

సింహాచలం తిరపతికి దగ్గరగా వచ్చి 'మావా! నువ్వు సెప్పిందుమాట లిన్నావు. తప్పిందు మాట లిన్నావు...ఆటిని నమ్మ మాకు...తల్లితోడు...నే నే పాపం ఎరగను



...ఆ పిల్ల పాపం కష్టంలో వుంది. ఆళ్ల పెద్దోళ్లకు కార్డు రాయించి పడేసినాను. ఆళ్లొచ్చి ఆ పిల్లను తోలుకెళ్లిపోతారు... నా మాట నమ్ము...' అన్నాడు.

తిరపతి ఉన్నట్టుండి పెద్దగా నవ్వడం మొదలుపెట్టాడు. లేచి వంగిపోయి పొట్ట పట్టుకుని మరీ నవ్వాడు. తర్వాత అకస్మాత్తుగా గంభీరంగా మారిపోయి 'ఆరేయ్! నాకు యాభై ఏళ్లురా...ఇట్టాటి మోసపు మాటలీ సెవుల్తో ఎన్ని యిన్నానో లెక్క లేదు... గుడ్డొచ్చి పిల్ల వెక్కిరించిందంట ...నాకు సదువులు నేర్పుతావురా దగాకోర్ ...లచ్చికి నీ సంగ తెల్తీదురా...పాపం పిచ్చి పిల్ల... నిన్ను నమ్మింది...ఇప్పుడందరికీ నీ ద్రోహం తెలిసిందిరా...అదురుష్టమంతు డివిలే మంచోళ్ల మద్దెనున్నావు... ఇంకో సోట అయితే పిచ్చికుక్క నాగా కొట్టి తరిమేసేవాళ్లు...సరే...నీ కిప్పుడే చెప్పేత్తే మంచిది... లచ్చి మీన ఇంక ఆశలు పెట్టుకో మాకు.. దానికీ కోటిగాడికీ నిన్ననే మనువు కుదిర్చేసినాం...' అంటూ లేచాడు.

సింహాచలం నివ్వెరపోయాడు. విషయం యింత దూరం వొస్తుందని అతడు కలలో కూడా అనుకోలేదు. అతని నోట మాట రాలేదు. అవాక్కయి శిలాప్రతిమలా నిలబడి పోయాడు.

తిరపతి విజయం సాధించినవాడిలా లేచి నిలబడి లోపలికి చూస్తూ మెటికలు విరిచి 'అమ్మా! మహాతల్లీ! నువ్వెవురివో నాకు తెల్దు...కాని గొప్ప తెలివిగల్దానివి.. సుకపడ తావు...నా ఉసురు కూడా పోసుకు బతుకు' అంటూ కొంత దూరం వెళ్ళి ఆగి 'ఇది లోకంరా.. ఈడ తెలివి తక్కువోళ్లు ఎవురూ లేరు ..పైన దేవుడుండాడ్రా ... అంతా సూస్తానే వుంటాడు. నీకూ, దానికీ కనా కష్టపు బతుకు రాసిపెట్టే వుందిలే... ఇంతకింత అనుబవిస్తారు ... ఎగిరి పడమా కండి...' అని తిడుతూ వెళ్ళిపోయాడు.

సింహాచలం సర్వస్వం కోల్పోయినవాడిలా ఒక్క నిముషం దీనంగా కూర్చున్నాడు. తర్వాత ఉన్నట్టుండి అతనికి కోపం ముంచుకువచ్చింది. లోపలచేరి యిరవై నాలు గ్గంటలూ ఏడుస్తూ ఈ పిల్ల అతని కొంపమీదికి తెచ్చింది అతని బతుకులో నిప్పులు పోసింది. ఆమె నిహ యిక్కణ్ణుంచీ తరిమివేస్తే తప్ప లాభంలేదు. అతడంతలో కోపంతో మొహం కందగడ్డలా చేసుకుని పెద్ద పెద్ద అడుగులువేస్తూ లోపలికి వెళ్లాడు. పెరియనాయకి ఏం గుర్తువచ్చిందో ఏమో — పెరటి గుమ్మంలో కూర్చుని నెమ్మదిగా ఏడుస్తున్నది.

సింహాచలం చప్పగా చల్లబడిపోయాడు. అంతలోనే 'అయ్యో పాపం' అనిపించిందతనికి. దగ్గరికి వెళ్ళి నిలబడి ఓదార్పుగా 'ఊరుకో అమ్మా! నువ్వట్టా కళ్లల్లొత్తలు పడేట్టు ఏడిత్తే మాత్రం ఆపోయినోడు తిరిగొస్తాడా? గుండె రాయిచేసుకో ... నా మాటినుకో...' అన్నాడు.

ఆమె కతని మాటలలో ఎన్ని అర్ధమయ్యాయో అతనికి తెలియదు. అయినా కొంగుతో కళ్లు తుడుచుకుని ఏడుపు మానేసి దూరంగా కొండల వంకా, కొండల మీద దట్టంగా ఉన్న చెట్ల వంకా, చూస్తూ ఉండిపోయింది.

అంతలో వాకిట్లో ఎవరిదో నవ్వు వినిపించింది. అతడు వెంటనే యివతలికి వచ్చాడు. గుర్నాథం నెత్తిన గుడ్డ కప్పుని నిలబడి వుండి నవ్వుతూ సింహాచలం వంక చూసి 'రెండు సిగిరెట్లియ్యవయ్యా!' అన్నాడు. అతడు సిగిరెట్లు తీసుకుని తన దారిన తాను పోకుండా, 'ఓహ్! ఏం వాన! ఏం వాన! ప్రాణాలు తీసేసిందే...ఎప్పుడు తెరిపి యిస్తుందోగాని...సూర్య భగవానుడి దర్శనమే కాలేదు అయిదారు రోజుల నుంచీ.. నేను పుట్టి బుద్ధెరిగిన తర్వాత యింతటి గాలి వాన చూళ్లేదనుకో...' అన్నాడు.

తర్వాత మళ్లీ ఒక్క క్షణం ఆగి 'అయినా నీకిదంతా పట్టదులే...హుషారుగా వున్నావు... నేనంతా విన్నాన్లే... మంచి పనే చేశావు....ఆపదలో వున్న ఆడపిల్లను రక్షించి నట్టూ అయింది. నీకు మంచి లాటు దొరికినట్టూ అయింది. అంతే మరి...ఏ పని చేసినా ఇహ పరాలు రెండూ చూసుకోవాలి...' అంటూ విరగబడి నవ్వాడు. తర్వాత తన దారిన తాను వెళ్లిపోయాడు.

సింహాచలం మతిపోయిన వాడిలా కూలబడ్డాడు. తర్వాత వొణుకుతున్న వేళ్లతో చెక్కబల్ల మీద కొన్నేపు తబలా వాయించాడు. వెంటనే ఉన్నట్టుండి ఒక సోడా కొట్టుకుని గడగడా తాగి బీడితీసి ముట్టించాడు! అలవాటు లేనందువల్ల ముందు పొగ గుండెల్లోకి పోయి దగ్గు వచ్చింది. వెంటనే తమాయించుకుని కాళ్ళు బల్ల మీదికి జాపి కూర్చుని పొరాతాగిన వాడిలా ఉద్రేకంగా 'ఒరేయ్! మీరందరూ మదుమలుకారు...పసరాల్లా... ఆపిల్లకూ నాకూ రంకు కడతారంట్రా... ఒక్కొక్కడూ ... రండ్రా...మీ అంతు తేల్చేస్తాను...రండ్రా... ఒక్కొ దెబ్బతో అందర్నీ సఫా చేసేస్తాను... రండ్రా...' అని అరిచాడు పెద్దగా...

పెరియనాయకి లోపలి నుంచి వచ్చి చూసింది. అక్కడ చుట్టుపక్కల ఎవరూ లేరు. అతడెవరితో అలా ఉద్రేకంగా మాట్లాడుతున్నాడో ఆమె కర్థం కాలేదు.

అంతలో అతడు వెనుదిరిగి చూసి సిగ్గుపడిపోయాడు. బీడి అవతల పారేసి మామూలుగా కూర్చుని కూనిరాగం తీయడం ప్రారంభించాడు...కొన్ని క్షణాలు ఆగి వెనుదిరిగి చూస్తే ఆమె అక్కడలేదు. అతడు గుండెల నిండా గాలి పీల్చుకుని కళ్ళు మూసుకుని అలాగే కూర్చున్నాడు.

—అంతకుముందు చాలాసార్లు సింగారవేలు తనను గురించిన వివరాలూ, తన యిబ్బందులూ అన్నీ చెప్పుకున్నాడు. అతడక్కడికివచ్చి మూడునెలలయిందేమో! వచ్చీ రాగానే ఎరువుల ఫ్యాక్టరీలో పనిలో చేరి ఒక పాకలో కాపురం పెట్టాడు. అతన్నీ, పెరియనాయకినీ చూసి అందరూ మొగుడూ పెళ్లాలనే అనుకున్నారు మొదట్లో...కాని అసలు విషయం ఎవరికి, ఎలా తెలిసిందో మరి, ఉన్నట్టుండి అందరూ 'అరవ్వాడు ఆ పిల్లను లేవదీసుకొచ్చాడంట...' అని చెప్పుకోడం ప్రారంభించారు. ఆ విషయం అందరికీ తెలిసింది. సింగారవేలు ఆ మాటలను విని కూడా పట్టించుకోలేదు. మామూలుగానే నవ్వుతూ తిరిగేవాడు. సింహాచలంతో ఒకసారి 'అవును తంబీ! ఆళ్లంతా అనుకునేది నిజం!' అని చెప్పాడు కూడా...ఆ సందర్భంలోనే తమ కథ అంతా చెప్పుకొచ్చాడు...పెరియనాయకీ, సింగారవేలూ చిన్నప్పటినుంచీ ప్రేమించుకున్నారు. అయితే కొన్నేళ్ల తర్వాత ఆ రెండు కుటుంబాల మధ్య కోర్టులో ఒక వ్యవహారం నడిచింది... అది తేలేందుకు చాలాకాలం పట్టింది. చివర కెప్పుడో వ్యవహారం ముగిసింది. ఒకరు గెలిచారు. మరొకరు ఓడిపోయారు.

ప్రాంతాలయినా వారి మధ్య ఉంటూవచ్చిన ద్వేషాలూ, పగలూ తగ్గలేదుసరికదా మరింతగా ఎక్కువయ్యాయి. ఈ యింటిమీది కాకి ఆ యింటిమీద వాలడానికి వీల్లేదు... ఈ యింటి పిల్లలు ఆ యింటి పిల్లలతో ఆటలాడుకోరాదు...వారూ, వీరూ ఎదురైతే మూతులు ముడుచుకుని, మొహాలు మాడ్చుకుని వెళ్ళిపోవడం...అప్పుడప్పుడు పిల్లులమీదా, ఎలుకలమీదా పెట్టుకుని ఒకరినొకరు తిట్టుకోడం, ఆడిపోసుకోడం, ఎక్కువైంది......అంతలో పెరియనాయకి తండ్రి ఆమె కొక సంబంధం కుదుర్చుకు వచ్చాడు. పెరియనాయకి ఏడ్చింది. తల్లితో తనకా పెళ్ళి యిష్టంలేదని చెప్పింది. తండ్రితో చెబుదామనుకున్నదిగాని భయంవల్ల చెప్పలేకపోయింది. తల్లి మాత్రం కూతుర్ని నాలుగు తిట్టి వూరుకున్నది. అంతలో యింట్లో పెళ్ళిపనులు ప్రారంభమైనాయి. పెరియనాయకి యిక సహించలేకపోయింది. చాటుగా సింగారవేలును కలుసుకుని మాట్లాడింది. అతడు ఆమెకు ధైర్యం చెప్పాడు. మాటిమాటికీ 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను...నువ్వు లేకపోతే బతకలేను...' అన్నాడు. తర్వాత ఇద్దరూ ఒకచోట కూర్చుని ఉపాయాలు ఆలోచించారు. ఎవరికి తోచింది వారు చెప్పారు. అవుననుకుని, కాదనుకుని చివరకు ఒక నిర్ణ

ము సు రు

యానికి వచ్చారు. తెల్లవారితే పెళ్ళి అనగా పెరియనాయకి ఆ క్రిందటి రాత్రి బయలుదేరి సెంట్రలుస్టేషనుకు వచ్చేట్టు... అప్పటికి సింగారవేలు అక్కడ టిక్కెట్లతో సిద్ధంగా వుండేట్టు నిర్ణయమైంది. తర్వాత గప్‌చిప్‌గా యిద్దరూ రైలెక్కి వెళ్ళిపోవడమే అన్నమాట...అంతా అనుకున్న ప్రకారమే జరిగింది......ముందు యిద్దరూ గుంటూరు వచ్చారు. అక్కడ ఎవరో చెప్పగా, ఇక్కడ కొత్తగా ఎరువుల కంపెనీ పెట్టారని తెలిసి యిక్కడికి వచ్చేశారు. వచ్చీరాగానే సింగారవేలు వారి కాళ్ళా వీరి కాళ్ళా పట్టుకుని ప్రాధేయపడి పని సంపాయించాడు. అతడు రోజూ ఉదయంనుంచీ సాయంకాలంవరకూ ఆ మట్టిలో, దుమ్ములో ఘాటైన వాతావరణంలో పనిచేసేవాడు పొద్దు గూకుతూవుండగా తల కొక గుడ్డ చుట్టుకుని దుమ్ము కొట్టుకున్న బట్టలతో ఉసూరుమంటూ యింటికి చేరుకునేవాడు. అలా ఎన్నాళ్ళో గడవలేదు. అతని ఆరోగ్యం దెబ్బతిన్నది. వారం రోజులపాటు జ్వరం మూలంగా అసలు లేవలేకపోయాడు. జ్వరం తగ్గిన తర్వాత నీరసంగానడిచి ఫ్యాక్టరీకి వెడితే అతన్ని పనిలోనుంచి తీసేశాం పొమ్మన్నారు. అతడు దిగాలుపడి తిరిగివచ్చాడు. పెరియనాయకి అతనికి ధైర్యం చెప్పింది. 'అంతగా అయితే నాదగ్గరున్న నగలు అమ్ముదాం...' అన్నది. కాని అతడు వినలేదు. రోజూ ఏదో కాయకష్టంచేసి రూపాయో, అర్థో సంపాయించుకొచ్చేవాడు. లేనినాడు అదీలేదు. ఇద్దరుగుట్టు చప్పుడు కాకుండా కడుపునిండా నీళ్ళుతాగి గడిపివేసేవాడు—

...సింహాచలం కళ్ళుతెరిచాడు...ఎదురుగా కోటమ్మ నిలబడివుండి 'ఏవయ్యా! వుగాకుందా?' అని అడుగుతున్నది.

సింహాచలం ఆవులించి 'లేదు' అన్నాడు.

ఆమె 'సరే...బాగుందయ్యా...వుగాకు నేకపోతే కొట్టెందుకు తెరిసినావు? మూసుకుని లోపల తొంగోకపోయావా? వుగాకు తీసుకెల్లకపోతే మా అయన ఎమిక లిరగ్గొడతాడు ... ఎట్టాగబ్బా...' అని గొణుక్కుంటూ వెళ్ళిపోయింది.

ఆకాశానికి చిల్లిపడినట్టు వర్షం నిలిచి కురుస్తున్నది. ఒక రంగురంగుల బుల్లిపిట్ట వర్షంలో వప్పగా తడిసి ఎగురుకుంటూ వచ్చి తడికెమీద నిలబడి రెక్కలు విదిలించుకుంటున్నది. దూరంగా కొండలన్నీ ఆ ముసురులో మసకమసగ్గా మాత్రమే కనిపిస్తున్నాయి.

సింహాచలం మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. అతనికి అయిదారు రోజులక్రిందట జరిగిన వృత్తాంతం అంతా కళ్ళముందు పునరావృతం అయింది.

—ఆనాడు సింహాచలం రైలుదిగివచ్చి, సరుకులన్నీ సర్దుకున్నాడు. అంతలోనే కొండలమీదా, క్రింద అడివిలోనూ, సమస్త ప్రపంచంమీదనూ చీకటి దట్టంగా వ్యాపించింది. సింహాచలం హరికేన్‌లాంతరు వెలిగించి తెచ్చి తీగకు తగిలించాడు. పక్కనే తడికెవెనక అతడు ఉదయం బయలుదేరి వెళ్ళేముందు ప్రారంభమైన పేకాట యిప్పుడే ముగిసినట్టున్నది. పేకలు అవతలపారేసి వాళ్ళందరూ కబుర్లలోపడ్డారు. సింహాచలం అటు వెళ్ళిచూశాడు, సింగారవేలు ఒకపక్కన మొహంమీద గుడ్డవేసుకుని పడుకుని వున్నాడు అక్కడ మధ్యలో దీపం వెలుగుతున్నది. కొందరు గోడకు ఆనుకుని కూర్చుని, మరికొందరు పడుములువాల్చి ఏవేవో విషయాలు మాట్లాడుకుంటున్నారు. అంతలోనే సంభాషణ తాగుడుమీదికి



విశేషం మోహిలో వెళ్ళింది.

ఒకడు బీడీ ముట్టించుకుంటూ 'ఆఁ! ఇప్పుడీ 'లా' వొచ్చింతర్వాత తాగుడు తగ్గిందా? వన్నడిగితే మునపటికంటె ఎక్కువైపోయివాదంటాను. మునుపెవుడో తాగదల్చుకున్నోడు తాగేవోడు. ఇప్పుడు వొద్దనే తలికి మరింత పెరిగింది. ఇప్పుడంతా మక్కోనుకుంటానే వుండారు...' అన్నాడు.

'అవునోస్! ముసుపే సంగం. ఆమాట కొస్తే... ఇప్పుడు ఇంటింటికీ సారా బట్టీ... పోయివేడు ఆ ఎంకటేశంగాడి పాక 'గుప్పు'న ఎట్టా తగలబడింది? సారాకాయిలుండ బట్టేగా?'

'అప్పుడు డబ్బులు పారేత్తే మంచిసరుకు దొరికేది. ఇప్పుడట్టా కాదు అందరూ వచ్చి అవేగానియసా సరుకు తాగుతా వుండారు. 'లా' వొచ్చి మంచి చేసిందంట.. ఏం మంచి?'

'అంతే మరి. నిషాకోసం ఏదిబడితే అది తాగేత్తా వుండారు...ఆపక్క పాకల్లోకి ఎల్లి సూడు తెలుసుద్ది. ఆ జహాన్‌గాడు స్పిరిట్ తాగుతాడంట..'

'వ్యసనమంటే అదేరా నాయినా! ఆయాల్టికి ఏం దొరక్కపోతే కిరసనాయిలు కూడా తాగేత్తాడు..'

'కిరసనాయిలు తాగితే కిక్కురుమనకుండా సచ్చి ఊరుకుంటాడు—'

సంభాషణ ఈ దశలో వుండగా సింగారవేలు ఒక్కసారిగా లేచి 'కిరసనాయిలుతాగితే సచ్చిపోతారా? ఎవురా మాట అనేది?' అన్నాడు ఛాలెంజి చేస్తున్నట్టు.

'నేను...నేనే అన్నానా మాట... ఏం? నువ్వు తాగ్గలవా?'

'తాగుతాను... కాయికిరసనాయిలు తాగుతాను...ఎంత పందెం?'

'అబ్బో! గొప్ప మొనగాడు బయల్దేరాడయ్యా! సరే... పాతిక రూపాయలు పందెం ..కానియ్ తాగు...'

అప్పుడు సింగారువేలు కళ్ళు మెరిశాయి. అతని చూపులలో తెగింపు కనిపించింది. కళ్ళు ఎగరవేసి లేచి, సరిగా కూర్చుని 'సరే...తెప్పించండి...' అన్నాడు నిశ్చయంగా.

అంతలో ఒకడు దీపం పెద్దది చేశాడు. ఒకణ్ణి డబ్బులిచ్చి కిరసనాయిలుకోసం పంపించారు. వాడు వెళ్ళి ముందు అందరికీ ఈ విషయం దండోరా వేశాడు. క్రమంగా అక్కడ జనం మూగారు. అంతా రణగొణ ధ్వనిగా వుంది. ఎదుటివాడు చెప్పేది వినిపించకుండా అందరూ ఒకటే రొదగా మాట్లాడుతున్నారు.

అంతలో అందరూ నిశ్శబ్దంగా ఆత్రంగా నిలబడి చూస్తూవుండగా సింగారవేలు సీసా కిరసనాయిలూ గుక్కెడు గుక్కెడుగా తాగేశాడు. చివరి గుక్క మింగి సీసా వంచి చూపించి వొణికే కాళ్లతో లేచి నిలబడి చెయ్యిజాపి 'డబ్బు లే...' అని అడిగి ఆ వ్యక్తి చేతిలోనుంచి నోట్లు అందుకున్నాడు. గోడకానుకుని నిలబడి నెమ్మదిగా లెక్క పెట్టుకున్నాడు తర్వాత జనాన్ని తప్పించుకుని యింటికి వెళ్ళిపోయాడు. జనం తర్వాత చాలా సేపు అతన్నిగురించి మాట్లాడుకున్నారు. మొత్తానికి అతడు గజ తాగుబోతు అయివుండాలనే నిర్ణయానికి వచ్చారు...

ఆనాటి రాత్రి ఆకాశంలో మబ్బులు దట్టంగా కమ్మాయి. దళసరి నల్లని తెరను ప్రపంచంమీద కప్పినట్టయింది... చల్లని గాలి దిగంతాలనుండి వేగంగా వీచింది దానితో ఆ మబ్బులన్నీ 'ఝుల్లు'న జలదరించాయి. దాదాపు అరగంటసేపు పెద్ద వర్షం కురిసింది.

తెలతెలవారుతూ వుండగా సింహాచలం లేచి కళ్ళునులుముకుంటూ యివతలికి వచ్చి కొయ్యబారిపోయాడు. సింగారవేలు పాకముందు జనం మూగివున్నారు... ఒకడు కత్తితో వెదురుబొంగులను చీలుస్తున్నాడు. మరొకడు వాటిని రెండు పొడుగాటి వాసాల మధ్య వుంచి తాటితో గట్టిగా బిగిస్తున్నాడు... ఆ చిన్నపందిరిలో సింగారవేలు శవాన్ని పడుకోబెట్టారు... పైనుంచి కిందిదాకా గుడ్డ కప్పారు. ఆ అరవపిల్ల పెరియనాయకి శవం పక్కన కూర్చునివుండి నోట్లో కొంగు కుక్కుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నది. సింహాచలం అంతా చూసి నిలువునా వొణికిపోయాడు.

తర్వాత నలుగురూ తలా ఒక చెయ్యివేసి పనులన్నీ ముగించారు. ఏమీ మిగిలిపోలేదు. ఆ చిన్న పాకలో ఆ అరవపిల్ల మాత్రం సన్నగా ఏడుస్తూ మిగిలిపోయింది. ఆ రాత్రి పన్నెండు గంటలవేళ మళ్ళీ ప్రకృతి పగబట్టినట్టు వర్షం ప్రారంభమైంది ఆకాశం జల్లెడలా తయారైంది. ఉరుములు మెరుపులతో రొదచేస్తూ అప్పుడే మొదలు ఈ కుంభవృష్టి...అప్పుడే ఎక్కడో పిడుగు పడిన ధ్వని... పెరియనాయకి హడలిపోతూ నిలువెల్లా వొణికిపోతూ పరుగెత్తుకు వచ్చిం దిక్కడికి ..అంతే...అలా మొదలైన గాలివాన యింతవరకూ తెరిపి యివ్వలేదు—

...సింహాచలం హఠాత్తుగా కళ్ళు తెరిచాడు. లేచి చేతులు వెనక్కు కట్టుకుని కొంచెంసేపు అటూ యిటూ పచార్లు చేశాడు. తర్వాత మొహం తుడుచుకున్నాడు. అతనికి లచ్చి జ్ఞాపకం వచ్చింది సన్నగా శలాకలావుండి ఎల్లప్పుడూ నవ్వుతూ వుంటుంది వెన్నలాటి మనసు మనిషి చామనచాయ మొహంలో ఎంత కళ! ఆమె ఎదుట నిలబడి కబుర్లు చెబుతూ వుంటే సింహాచలం పరవశించిపోయేవాడు. ఒకసారి తొందరపడి చెయ్యి పట్టుకోబోతె లేడి పిల్లలా ఛెంగున గెంతి తప్పించుకుని కొనదేలిన సన్నని ముక్కుమీద వేలు వేసుకుని 'అప్పు.. అప్పుడే కాదు ..' అంటూ మాటిమాటికీ వెనుదిరిగి చూస్తూ నవ్వుతూ వెళ్ళిపోయింది

అతడు హఠాత్తుగా నీరసపడిపోయాడు. ఇక లచ్చి తన మొహం చూడదు కాబోలు! దాని పట్టుదల తనకు తెలీదు గనుకనా? ఇక జన్మాంతమూ లచ్చి తనకు దూరమైపోయినట్టే. అందులో ఏ మాత్రమూ అనుమానం లేదు...

సింహాచలం ఉలికిపడి లేచి నిలబడ్డాడు. ఎదురుగా గొడుగుల్లో యిద్దరు నడివయసు వ్యక్తులు నిలబడి వున్నారు. వారిలో ఒకాయన నోట్లోని తమ్మిని ఉమ్మివేసి 'సింహాచలం యారప్పా నీవ్.' అని అడిగాడు.

సింహాచలం ఒక్క ఉదుటున లేచి 'రండి బాబూ, రండి. నేనే సింహాచలాన్ని...మీ అమ్మాయి లోపలుంది. రండి...' అన్నాడు. ఆ యిద్దరూ హడావిడిగా గొడుగులు ముడిచి లోపలికి వచ్చారు.

పెరియనాయకి హఠాత్తుగా లేచి నిలబడి 'అప్పా' అని పెద్దగా ఏడుస్తూ తండ్రిని కౌగిలించుకున్నది. అతడు కూడా కళ్ళనీళ్ళు పెట్టుకుని ఆమెను సముదాయిస్తూ చాలాసేపు మాటా పలుకూ లేకుండా నిలబడిపోయాడు, తర్వాత ఆ

ముసురు

ముగ్గురూ ఉండిఉండి కళ్ళు తుడుచుకుంటూ అక్కడే కూలబడ్డారు. పెరియనాయకి మధ్యమధ్య ఏడుస్తూ అన్నివిషయాలూ చెప్పింది. ఆ రెండో వ్యక్తి సింగారవేలు తండ్రి అనీ, సింగారవేలు ఆయన కొక్కడే కొడుకనీ అర్థంకాగానే సింహాచలం తల్లడిల్లిపోయాడు. వారు ముగ్గురూ మాట్లాడుకుంటూ వుండగా బాగా అర్థం కాకపోయినా ఏదో కొంతకుకొంత అర్థం చేసుకుంటూ సింహాచలం అలాగే చాలాసేపు నిలబడ్డాడు. తర్వాత సంభాషణ తన మీదికి మళ్ళిందని అర్థం చేసుకోగానే ఇవతలికి వచ్చి బల్లమీద నిశ్శబ్దంగా కూర్చుండిపోయాడు.

వర్షపుజల్లు తగ్గింది. చల్లనిగాలి మాత్రం అడవిలోనూ కొండల మీద సుళ్ళు తిరుగుతూ వేగంగా వీస్తూనే వుంది. మబ్బులు బలహీనపడిపోగానే మందంగా చంద్రుడి కాంతి వ్యాపించింది.

అంతలో ఆ వ్యక్తులిద్దరూ యివతలికి వచ్చి వచ్చీరాని తెలుగులో అతన్ని చాలాసేపు పొగిడారు అతడు చాలా మంచివాడన్నారు. అతడు లేకపోతే పెరియనాయకి కూడా తమకు దక్కేది కాదన్నారు. అతని రుణం ఈ జన్మలో తీర్చుకోలేమన్నారు. చుట్టుపక్కలవారి మాటలను గురించి పెరియనాయకి చెప్పిందనీ వాటిని అసలు పట్టించుకోవద్దనీ అన్నారు. ఏనుగులను చూసి కుక్కలు మొరుగుతాయి, అంతలో ఏమీ మునిగిపోదన్నారు...

సింహాచలం ఏమీ మాట్లాడలేక అలా బొమ్మలా కూర్చుని అంతా విన్నాడు. తర్వాత వెనుదిరిగి చూస్తే పెరియనాయకి కళ్ళనిండా కృతజ్ఞత నింపుకుని చూస్తూ నిలబడి వున్నది.

మరోగంటలో అందరూ ప్రయాణానికి సిద్ధమైనారు. సింహాచలం కొట్టుకట్టేసి గుమ్మానికి తాళంవేసి వారి వెంట మైలు దూరమూ నడిచి స్టేషనుకు వచ్చాడు. నడుస్తున్నంతసేపూ ఉండి ఉండి ఆ పెద్ద మనుషులు తమ కృతజ్ఞత తెలియబరుచుకుంటూనే వున్నారు.

వారు ఆ చిన్న స్టేషన్‌కు చేరుకున్న అయిదు నిముషాల వ్యవధిలోనే రైలు వచ్చింది. ఆ ముగ్గురూ చివరి పెట్టెలో ఎక్కి కూర్చున్నారు గార్డు ఈలవేయగానే ఆ పెద్దమనుషులిద్దరూ చేతులు జోడించి 'వస్తాం సామీ ...' అన్నారు. పెరియనాయకి కూడా రెండు చేతులూ జోడించి ఏదో అన్నదిగాని, ఆ మాటలు రైలు కదులుతున్న రొదలో అతనికి వినబడలేదు. అతడు కొద్ది క్షణాలు చేయి వూపుతూ అలాగే నిలబడిపోయాడు.

అంతలో ఎక్కడలేని ఒంటరితనం అతన్ని ఆవహించింది అతడు జేబులు తడువుకున్నాడు. చొక్కాచేతుల మడతలువిప్పి మళ్ళీ పెట్టుకున్నాడు. చేతివేళ్ళతో జుట్టును పైకి తోసుకున్నాడు. తర్వాత నెమ్మదిగా నడిచి యివతలికివచ్చి రోడ్డు ఎక్కాడు. ఆ రోడ్డు తెల్లగా కొండనుచుట్టిన తెల్లని కొండచిలువలా వుంది.

అతడు చాలదూరం నడిచివచ్చి ఒకచోట ఆగాడు ఆ పాకలోనుంచి నవ్వులు వినిపిస్తున్నాయి. లచ్చి గలగల నవ్వుతున్నది ఆరెండో గొంతు కోటిగాడిదికదూ! వాడు పాతబాకీ రెండు మూడు రూపాయలివ్వాలి ... రేపు నలుగురిలో నిలబెట్టి అడిగి వసూలు చెయ్యాలి...

అతడు కాలికి అడ్డంవచ్చిన రాయిని కాలితో ఒక్కతన్నుతన్ని విసురుగానడవటం ప్రారంభించాడు. అంతలో ఒకచోటఆగి ఆకాశంలోకి చూశాడు. ఇన్నాళ్లనుంచీ అసహ్యంగా అల్లకల్లోలంగావున్న ఆకాశం యిప్పుడు స్వచ్ఛంగావుంది. చంద్రబింబం పెద్ద మంచి ముత్యపు ముక్కవలె రెండు చిన్న మబ్బు తునకల మధ్య ప్రకాశిస్తున్నది.

సింహాచలం నోటివెంట అప్రయత్నంగా ఈల వచ్చింది. ఈ కొద్దిరోజుల ముసురుతో తాను చాలా కోల్పోయాననిఅనుకున్నాడింతసేపూ ... ఇప్పుడు తమాయించుకున్నాడు. ఇక ఆపకుండా ఈల వేసుకుంటూ హుషారుగా నడిచి యిల్లుచేరుకుని ఆరుబయట కుక్కిమంచం వేసుకుని పడుకుని గుర్రుపెట్టి నిద్రపోయాడు. అతనికి కలలో అన్నీ రంగు రంగుల మంచి ముత్యాలూ గంధపు చెట్ల అరణ్యాలూ కనిపించాయి ●